క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఐనవోలు : మండలంలోని వెంకటపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు నిహారిక, చరణ్‌తేజ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు మెదక్ జిల్లా తూప్రాన్‌లో రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం హెచ్‌ఎం రమేశ్, పీడీ సుమలత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు పద్మావతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

కమలాపూర్ : మండలంలోని అంబాలలో గంజాయి సేవిస్తున్న నలుగురిని గురువారం పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని అంబాలలో కంది శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వెంచర్‌లో కమలాపూర్ మండలంలోని నేరెళ్లకు చెందిన గోల్కొండ రాజ్‌కుమార్, హుజూరాబాద్‌కు చెందిన జంపాల తరుణ్, సాతుకు అజయ్, రావుల మణిదీప్ అనే నలుగురు గంజాయి సేవిస్తుండగా పట్టుకుని వారి నుంచి 5 గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి కృషి

దామెర : అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిమానానికి తనవంతు కృషిచేస్తానని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదళ్లలో పునర్నిమిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కొంత నగదును అందించారు. ఈ కార్యక్రమంలో మాదాసు చిరంజీవి, పిట్టల రమేశ్, రవి, రాజు, శ్రీకాంత్, నవీన్, అనిల్, సుమంత్, రోహిత్, రాజ్‌కుమార్, సాంబరాజు ఉన్నారు.

జిల్లా కార్యవర్గంలో చోటు

ఎల్కతుర్తి : టీయూడబ్ల్యూయూజే (తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు హెచ్–143)లో మండలంలోని పాత్రికేయులకు చోటు లభించింది. జిల్లా కార్యవర్గ సభ్యులుగా భీమదేవరపల్లి మండలానికి చెందిన అప్పని సిద్ధు, సిక భిక్షపతి, జక్కుల నాగరాజును నియమించినట్లు యూనియన్ రాష్ట్ర కోశాధికారి యోగానంద్ గురువారం ప్రకటనలో తెలిపారు. తమ నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎడ్లబండి పైనుంచి పడి రైతు మృతి



రాంబాబు (ఫైల్)

ఆత్మకూరు: ఎడ్లబండి పై నుంచి పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని నీరుకుళ్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బుద్దె రాంబాబు (48) పొలం వద్ద నుంచి ఎడ్లబండిలో ధాన్యం బస్తాలు వేసుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దమ్మకుంట కట్ట వద్ద గుంతలో బండి చక్రం పడింది. దీంతో ధాన్యం బస్తాలతో పాటు రాంబాబు కింద పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు పరిశీలించి మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపారు.

సీఎంకు లక్ష ఉత్తరాలు..

నడికూడ : బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన జేఏసీ ఆధ్వర్యంలో కౌకొండ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాసి పంపించారు. గణతంత్ర దినోత్సవం రోజు జెండా ఆవిష్కరణ వద్ద భారత రాజ్యాంగ గ్రంథం, అంబేడ్కర్ చిత్రపటం ఉంచాలని, రాజ్యాంగాన్ని పఠించాలని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థల్లో భారత రాజ్యాంగ పీఠికను చదవాలనే డిమాండ్లతో కూడిన ఉత్తరాలను పంపించారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చుక్క రత్నాకర్, ప్రవీణ్, సూర్యం, దిలీప్, జానీ, అర్జున్, ప్రశాంత్, విజయ్, పవన్ పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ జయంతి



శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రజని చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

'డబుల్' పంపిణీకి మోక్షమెప్పుడో..?

'కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అడుగులు వేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం.. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణమై నిరుపయోగంగా మారిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తే మా సొంతింటి కల నెరవేరేది. మాకు ఇళ్లు, ఇంటిస్థలం లేదాయే.. అర్హులుగా గుర్తించి వాటిని పంపిణీ చేస్తే సగం భారం దిగిపోయేది' అనే అభిప్రాయాలు మండల ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

- ఏళ్లుగా తప్పని నిరీక్షణ
- గత ప్రభుత్వం నిర్మించినా నిరుపయోగంగానే..
- దృష్టి సారించని పాలకులు, అధికారులు



కమలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

కమలాపూర్ : ఇళ్లు, ఇంటి స్థలం లేని నిరుపేదల కోసం గత ప్రభుత్వం మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పటికీ పంపిణీకి నోచుకోకపోగా కళ్లెదుటే కనిపిస్తూ లబ్ధిదారులను ఊరిస్తున్నాయి. వాటిని ఎప్పుడు పంపిణీ చేస్తారా? తమ సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందా? అని కొన్నేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామంటున్న ప్రస్తుత ప్రభుత్వం.. నిర్మాణాలు పూర్తైన డబుల్ బెడ్రూం ఇళ్లల్లో కనీస మౌలిక వసతులు కల్పించి ఇల్లు, ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు పంపిణీ చేస్తే లబ్ధి చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మండల వ్యాప్తంగా 420 ఇళ్లు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కమలాపూర్ మండలానికి 790 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా 520 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అందులో కమలాపూర్‌లో 320, గూడూరులో 50, మర్రిపల్లిగూడెంలో 50 ఇళ్ల చొప్పున మొత్తం 420 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అయినప్పటికీ రోడ్లు, డ్రెయినేజీలు, మరుగుదొడ్లు, విద్యుత్, నీటివసతి వంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

మందు, విందులకు అడ్డాగా..

సుమారు మూడేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వందలాది మంది కార్మికులు బతుకుదెరువు కోసం మండల కేంద్రానికి వలస వచ్చారు. వారికి ఇక్కడ ఉండటానికి ఇళ్లు దొరక్క, అద్దె చెల్లించలేక కమలాపూర్‌లో ఖాళీగా ఉన్న కొన్ని డబుల్ బెడ్రూం ఇళ్లలో కొందరు నివాసం ఉంటున్నారు. మరికొందరు పేకాడుతూ మద్యం, గంజాయి వంటివి సేవిస్తూ అనేక అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

పంపిణీ చేయాలని స్థానికుల విజ్ఞప్తి..

గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయకపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. ఇళ్లు, ఇంటి స్థలం లేని నిరుపేదలు ఎందరో ఇప్పటికీ ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటూ అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటిస్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు ఇస్తామంటున్న ప్రస్తుత ప్రభుత్వం ఇళ్లు, ఇంటి స్థలంలేని నిరుపేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లల్లో కనీస మౌలిక వసతులు కల్పించి పంపిణీ చేస్తే తమకు అద్దె ఇబ్బందులు తొలగిపోయి సొంతింటి కల నెరవేరుతుందంటున్నారు పలువురు నిరుపేదలు.

ఎనిమిదేళ్లుగా అద్దె ఇంట్లోనే..



మేము ముగ్గురు అన్నదమ్ములం. మాకు భూములు లెవ్వు, జాగలు లెవ్వు. ఉండటానికి ఇళ్లు కూడా లేదు. ఏ రోజుకు ఆ రోజు కూలి పని చేసుకుంటేనే రోజు గడిచేది. మేము ఎనిమిదేళ్లుగా నెలకు రూ.1500 అద్దె కడుతూ జీవితం వెళ్లదిస్తున్నాం. కమలాపూర్‌లో కట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించి వెంటనే పంపిణీ చేయాలి.

– పిట్టల కృష్ణ కమలాపూర్

ఈ ప్రభుత్వమైనా కనికరించాలి



మాకు సొంతిళ్లు లేక నెలకు రూ.2 వేల అద్దె కడుతూ 20 ఏళ్లుగా నెట్టుకొస్తున్నాం. రోజు పనికి పోతేనే పూట గడిచేది. ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తే మాకు ఎంతో న్యాయం చేసినట్లు ఉంటుంది. మాలాంటి పేదలపై దృష్టి పెట్టాలి. ప్రస్తుత ప్రభుత్వమైనా కనికరించి ఆ ఇళ్లను నిరుపేదలకు పంపిణీ చేయాలి.

– జేరుపోతుల సునీతా, కమలాపూర్

కాంగ్రెస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే వర్తించేలా కుట్ర జరుగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు గంటా శ్యాంసుందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. 15 నెలల కాలం గడిచినప్పటికీ ఇప్పటి వరకు ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో మండలంలోని 14,194 దరఖాస్తులు తీసుకున్నారని, ఇప్పటి వరకు ఏ ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. సర్వేలు, గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడమేకానీ సంక్షేమ పథకాలు అమలు చేసి లబ్ధి చేకూర్చిన దాఖలాలు లేవని, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో పేర్లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేక మొదలైందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదని విమర్శించారు. ప్రజలను అయోమయంలోకి నెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నాయకులు ప్రసాద్, సుమన్, పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు



కమలాపూర్ : మండలంలోని కానిపర్తికి చెందిన ఎస్‌ఆర్‌ఐ, స్నేహ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి కూతురు స్నేహలత చేతుల మీదుగా కేక్ కట్‌చేయించారు.

గ్రామసభలు గరంగరం



ఐనవోలు : కొండపర్తిలో చోటుచేసుకున్న తోపులాట

- రసాభాసగా కానిపర్తి గ్రామసభ
- అర్హుల జాబితాలో ఉద్యోగులు, విదేశాల్లో ఉంటున్న వారిపేర్లు ఉన్నాయంటూ పలువురి ఆగ్రహం



కమలాపూర్ : కానిపర్తిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

కమలాపూర్ : మండలంలోని కానిపర్తిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభ రసాభాసగా మారింది. అర్హుల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, తమ పేర్లు ఎందుకు లేవంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. మండలంలోని కానిపర్తి, నేరెళ్ల, భీంపల్లి, మర్రిపల్లిగూడెం, శంభునిపల్లి, శ్రీరాములపల్లి, ఉప్పులపల్లి గ్రామాల్లో రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు అర్హుల ఎంపిక కోసం గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కానిపర్తిలో నాలుగు పథకాలకు సంబంధించిన అర్హుల జాబితా చదివి వినిపించారు. ఆ జాబితాల్లో అనర్హుల పేర్లు ఉన్నాయని, అర్హులైన తమ పేర్లు మాత్రం లేవని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు, ఎకరాల కొద్ది భూములున్న వారి పేర్లు, చివరకు ఫారిన్‌లో ఉంటున్న వారి పేర్లు కూడా జాబితాలో ఉన్నాయని మండిపడ్డారు. జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, వారికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అధికారులు సూచించగా.. ఇప్పటికే తాము పలుమార్లు దరఖాస్తు చేసుకున్నామని, అయినప్పటికీ జాబితాలో తమ పేర్లు లేవని వారించారు. అధికార పార్టీ వాళ్లు చెప్పిన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇస్తారా అంటూ అధికారులను నిలదీశారు. మిగతా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

కొండపర్తి గ్రామసభలో తోపులాట

ఐనవోలు : ఐనవోలు మండలంలో వెంకటపూర్, కొండపర్తి, ముల్కలగూడెం, నర్సింహులగూడెం, వనమాల కనపర్తి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను అధికారులు గురువారం నిర్వహించారు. కొండపర్తిలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు అర్హుల జాబితాలోని పేర్లను చదువుతుండగా ప్రజలు ఆగ్రహానికిలోనయ్యారు. గ్రామంలో రేషన్ కార్డుల మంజూరు కోసం 510 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 79 మంది పేర్లను ప్రకటించడం, ఇందిరమ్మ ఇళ్ల దరకాస్తు దారులు 1,250 మంది ఉండగా 506 మంది పేర్లను ప్రకటించడంతో అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు సైతం ఆగ్రహించారు. దీంతో ఓ కాంగ్రెస్ నాయకుడు జోక్యం చేసుకుని సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తుండగా ఇందులో రాజకీయ నాయకులు మాట్లాడవద్దని స్థానికులు కోరారు. దీంతో తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు.

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి, ప్రగతి సింగారం, గంగిరేణిగూడెం, నూర్జహాన్‌పల్లి, సూరంపేట గ్రామాల్లో గురువారం గ్రామసభలు జరిగాయి. అర్హులకు సంక్షేమ పథకాలు వర్తించేలా చూస్తామని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని పీచర, షోడాషపల్లి, చింతలతండా గ్రామాల్లో గురువారం గ్రామసభలు జరిగాయి. పీచర గ్రామసభలో అర్హుల పేర్లు చదువుతుండగా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుని లిస్ట్‌లో అర్హుల పేర్లను తొలగించి కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిపేర్లు ఉన్నాయంటూ ఆందోళన చేపట్టారు.

రెండు గ్రామాల్లో 505 దరఖాస్తులు

పరకాల : మండలంలోని నాగారం, వెల్లంపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు ప్రశాంతంగా జరిగాయి. అర్హుల జాబితాలో పేర్లులేనివారు 2 గ్రామాల నుంచి 505 మంది దరకాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు నాగారంలో 75, వెల్లంపల్లిలో 100 మంది దరఖాస్తులు చేసుకోగా రేషన్‌కార్డుల కోసం నాగారంలో 180, వెల్లంపల్లి 132 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కోసం నాగారంలో 10, వెల్లంపల్లిలో 8 మంది దరకాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆత్మకూరు : గుడెప్పాడ్, నీరుకుళ్ల, కొత్తగట్టు, నాగయ్యపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలను డీఆర్డీఓ శ్రీను, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ధర్మసాగర్ : పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని స్పష్టం చేశారు. జాబితాలో పేర్లు రాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతుందని, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఉద్దేశపూర్వకంగా కొంత మంది ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు నమ్మొద్దని అన్నారు. ఆర్డీఓ రాథోడ్ రమేశ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఏపీఓ పాల్గొన్నారు.

పరకాల : సంక్షేమ పథకాల మంజూరు జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, మున్సిపల్ కమిషనర్ సుష్మ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో 1,2,12,13,14 వార్డుల్లో సభ నిర్వహించారు. పేర్లు లేనివారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కమిషనర్ సుష్మ, వివిధ శాఖల అధికారుల, కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో గొడవలు, అవాంతరాలు వాస్తవమే..

● ఎమ్మెల్సీ కోదండరాం



సస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

ఎల్కతుర్తి: ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ, రైతుభరోసా, ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేసేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇళ్లపై పలు చోట్ల గొడవలు, అవాంతరాలు ఎదురవుతున్న మాట వాస్తవమేనని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో చెప్యాల ప్రభాకర్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందగా గురువారం నిర్వహించిన సంస్మరణ సభకు కోదండరాం హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఏమీ బాగాలేదన్నారు. అయినా ప్రభుత్వం స్కీంలు అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అప్పే.. ఏడాదికి 13వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఓవైపు వడ్డీ చెల్లిస్తూనే సంక్షేమంపై దృష్టి సారిస్తుందని అన్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మందికి ఇళ్లు లేవన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో అధికారులు ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా నిర్వర్తించాలన్నారు. అర్హులకు అన్యాయం జరగొద్దని అన్నారు. అంతకుముందు చెప్యాల ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి దేశపతి శ్రీనివాస్, కవ్వ లక్ష్మారెడ్డి, వంగ రవీందర్ పాల్గొన్నారు.

గుడుంబా తయారీపై ఉక్కుపాదం

● ఎక్సైజ్ సీఐ తాతాజీ



బెల్లంపానకాన్ని పారబోస్తున్న సీఐ తాతాజీ, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

శాయంపేట : గుడుంబా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతామని ఎక్సైజ్ సీఐ తాతాజీ అన్నారు. గుడుంబా నియంత్రణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని గట్లకానిపర్తి గ్రామం, పరకాల మండలంలోని పోచారం, కామారెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించారు. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన మోరె మధునమ్మ, ఆకునూరి మమత, బొమ్మ శారద, పరకాలకు చెందిన సాదు సరోజన గుడుంబా విక్రయిస్తుండగా వారిని పట్టుకొని గుడుంబా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. గుడుంబా తయారీ, విక్రయిస్తే చట్టపరంగా కేసులు తప్పవని హెచ్చరించారు. గుడుంబాతో ప్రాణాలు పోతున్నాయని అన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సులోచన, కానిస్టేబుల్స్ లక్ష్మణాచారి, విజయ్‌కుమార్ ఉన్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహించొద్దు

● డీఆర్డీఓ శ్రీను



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఓ

ఆత్మకూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో గల నర్సరీల్లో పెంచే మొక్కలపై నిర్లక్ష్యం వహించొద్దని డీఆర్డీఓ శ్రీను అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో గల నర్సరీని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో అన్ని రకాల మొక్కలను అందుబాటులో ఉంచాలని అన్నారు. మొక్కలను కాపాడాల్సిన బాధ్యత వనసేవకులపై ఉందని అన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే మళ్లీ మొక్కలు నాటాలని అన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

గొల్ల, కురుమలు అన్నిరంగాల్లో రాణించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై అశోక్

దామెర : గొల్ల, కురుమలు అన్నిరంగాల్లో రాణించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో జీఎంపీఎస్ 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గొల్ల, కురుమలు ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ దీపిక, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేశ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు మిర్యాల రవి, గాజు రాజు, మండల నాయకులు వంగ రవి, ఐలయ్య, చంద్రయ్య, రాజు, లక్ష్మయ్య, రవి, భిక్షపతి, సారంగం, సమ్మయ్య పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతపై అవగాహన అవసరం



ఐనవోలు : జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఎంఈఓ రామ్‌ధన్

ఐనవోలు : విద్యార్థి దశలోనే సామాజిక బాధ్యత, సేవాభావంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ పులి ఆనందం అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై మండలస్థాయి ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీని అరికట్టేందుకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అతివేగం, మద్యపానం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ని పాటించకపోవడం వలన రాష్ట్రంలో ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు జనవరి 24న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి పోటీలు హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సతీశ్, నిర్వాహకులు అశోక్‌కుమార్, నర్సయ్య, సరళ, గైడ్ ఉపాధ్యాయులు మంజుల, డాక్టర్ శివకుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ రామ్‌ధన్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, సరియైన భద్రత మార్గదర్శకాలు అనుసరించకపోవడమే కారణమన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతాపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హెచ్‌ఎం ధర్మప్రకాశ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



నడికూడ : మాట్లాడుతున్న సీఐ క్రాంతికుమార్

నడికూడలో..

నడికూడ : రోడ్డు భద్రతా నియామకాలను పాటించాలని సీఐ క్రాంతికుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతాపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ

వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన మాతంగి ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ కొయ్యడ మహేందర్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 50 కేజీల బియ్యం అందజేశారు.